
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

ఆదివారం 18 ఆగస్టు 2024 | 5



కాకినాడ జిల్లా జేసీగా రాహుల్‌మీనా



కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 17: కాకినాడ జిల్లా జేసీగా రాహుల్ మీనాను నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై కాకినాడకు వస్తున్నారు. 2021వ బ్యాచ్‌కు చెందిన రాహుల్‌మీనాది రాజస్థాన్ ప్రాంతం. రెండురోజుల్లో ఆయన కాకినాడ జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.



కాకినాడనుంచి హోప్‌ఐలాండ్‌కు వెళ్లే మార్గం(మ్యాప్‌లో)

మన మాల్‌దీవ్స్‌కు మళ్లీ హోప్!



- కాకినాడ హోప్ ఐలాండ్ పర్యాటకంపై ఇన్నేళ్లకు మళ్లీ చిగురిస్తోన్న ఆశలు
- త్వరలో బోటు షికారు ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు
- రూ.2కోట్లతో కొత్త బోటు కొనుగోలుకు యోచిస్తోన్న పర్యాటకశాఖ
- అటు పీపీపీ విధానంలోను కాంట్రాక్టర్‌ను ఆహ్వానించి బోటుషికారుకు ఏర్పాట్లు
- హోప్‌ఐలాండ్‌కు బోటు ప్రారంభంపై కసరత్తు చేస్తోన్న పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్
- ఇటీవల ఉమ్మడి జిల్లా పర్యాటక అధికారులతో సమీక్షలోను సుదీర్ఘంగా చర్చ
- త్వరలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదలయ్యేలా చేసే యోచన
- అటు కచ్చులూరు బోటు ప్రమాదం తర్వాత హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు రద్దు
- అప్పటినుంచి పర్యాటకాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన గత వైసీపీ ప్రభుత్వం

కాకినాడ తీరం నుంచి సముద్రంలో హోప్ ఐలాండ్ పర్యటనకు వెళ్లాలనుకునే పర్యాటకులు తీపి కబురు అందబోతోంది. బోటు షికారును ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీని నిమిత్తం పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేష్ రూ.2కోట్లతో కొత్త బోటు కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. దీనిపై త్వరలో సీఎం చంద్రబాబును కలవనున్నారు. ఇదే జరిగితే మాల్‌దీవ్స్ లాంటి మన హోప్‌ఐలాండ్ అందాలు మళ్లీ పర్యాటక ప్రియులను అలరించనున్నాయి.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నాలుగున్నరేళ్ల కిందట గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదం నేపథ్యంలో అప్పటినుంచి హోప్ ఐలాండ్ పర్యాటకాన్ని గత వైసీపీ ప్రభుత్వం పక్కనపడేసింది. కనీసం తిరిగి బోటు షికారు ప్రారంభించడానికి పెద్దగా ప్రయత్నాలేమీ చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన నేపథ్యంలో పర్యాటకాన్ని పరుగులు తీయించడానికి శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య అంశంగా పట్టాలెక్కించాలని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ నిర్ణయించారు.

ఆ ఘటనతో నిలిచిన బోటింగ్

2019 సెప్టెంబర్‌లో గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదం నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వం అన్నిరకాల బోటు షికార్లను నిలిపివేసింది. ఇందులోభాగంగా హోప్ ఐలాండ్ పర్యాటకం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో నాలుగున్నరేళ్ల నుంచీ హోప్‌ఐలాండ్‌కు వెళ్లడానికి బోటు సర్వీసే లేదు. దీంతో ఎక్కడెక్కడినుంచో కాకినాడకు వస్తున్న పర్యాటకులు ఉసూరుమంటున్నారు. పర్యాటకులనుంచి ఒత్తిడి పెరగడంతో 2023లో హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు ప్రారంభించడానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రయత్నించింది. కచ్చులూరు ప్రమాదానికి ముందు కాకినాడ నుంచి హోప్‌ఐలాండ్‌కు నడిపిన పాత బోటు మేజువాణిని తిరిగి ప్రారంభించడానికి సిద్ధపడింది. కానీ సముద్రంలో ప్రయాణించడానికి ఫిట్‌నెస్ లేకపోవడంతో బోటుకు కాకినాడపోర్టు లైసెన్సు తిరస్కరించింది. కొత్త బోటు కొనాలని భావించినా గత వైసీపీ సర్కారు పర్యాటకశాఖకు సహకరించకపోవడంతో అధికారులు నిస్సహాయులుగా మారారు. సొంత బోటు లేకపోవడం, అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏడాదిన్నర కిందట ఏపీటీడీసీ ప్రైవేటు పార్టీల ద్వారా హోప్ ఐలాండ్‌కు బోటు నడిపించేందుకు ప్రతిపాదించింది. అందులోభాగంగా సముద్రంలో సాహస జలక్రీడల పేరుతో టెండర్లు పిలిచింది. కాకినాడ నుంచి హోప్ ఐలాండ్‌కు 50సీట్లతో బోటుషికారు ప్రారంభించడానికి ప్రైవేటు ఏజెన్సీలు ముందుకు రావాలని బిడ్లు ఆహ్వానించింది. రూ.50లక్షల ప్రాజెక్టు వ్యయంతో దీన్ని చేపడుతున్నామని, పనులు దక్కించుకున్న సంస్థ పర్యాటకులతో రాకపోకలు సాగించడంతో పాటు ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని టెండర్ నిబంధనల్లో ప్రస్తావించింది. హౌస్‌బోట్, స్పీడ్‌బోట్, జెట్‌స్కీ సర్వీసులు ప్రారంభించాలని టెండర్ నిబంధనల్లో పేర్కొంది. రూ.70లక్షల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టులో భాగంగా బోట్లు సమకూర్చడానికి ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. దీంతో కాకినాడకు చెందిన ఓ కంపెనీ హోప్‌ఐలాండ్‌కు బోటు సర్వీసు నడపడానికి ముందుకు వచ్చింది. ఏపీటీడీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఈలోపు జగన్ సర్కారు రంగంలోకి దిగి కాంట్రాక్టర్‌కు షాక్ ఇచ్చింది. బోటు సర్వీసు ద్వారా ప్రతినెల వచ్చే ఆదాయంలో పదిశాతం ప్రభుత్వానికి రెవెన్యూ షేర్ ఇవ్వాలని నిబంధనలు విధించింది. దీంతో సదరు కాంట్రాక్టర్ పారిపోయాడు.

అందమైన అద్భుతం


కాకినాడ అంటే పర్యాటకులకు ఠక్కున గుర్తొచ్చేది హోప్ ఐలాండ్. 200ఏళ్ల కిందట సముద్రంలో సహజసిద్ధంగా ఏర్పడిన ఈ ద్వీపం రక్షణ కవచంలా కాకినాడ నగరాన్ని కాపాడుతోంది. సముద్రం మధ్యలో 16కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ ఐలాండ్ పర్యాటకులకు పంచే ఆనందం అంతాఇంతా కాదు. అందుకే ఎక్కడినుంచో పర్యాటకులు కాకినాడ వస్తుంటారు. చుట్టూ నీలి సముద్రం.. నీటిపై తేలియాడుతూ కట్టిపడేసే మడ అడవులు ప్రకృతిప్రియులకు మాటల్లో వర్ణించలేని అనుభూతులు అందిస్తాయి.

స్వదేశీ దర్శన్ పథకం కింద కోస్టల్ సర్క్యూట్ పేరుతో హోప్‌ఐలాండ్ అభివృద్ధికి కేంద్ర పర్యాటకశాఖ 2014లో రూ.64కోట్లు మంజూరు చేసింది. ఇందులో కొన్ని నిధులతో హోప్ ఐలాండ్‌లో కొన్ని నిర్మాణాలు చేపట్టింది.

కొత్త ప్రభుత్వంలో శరవేగంగా అడుగులు..

రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉన్న డిమాండ్‌పై ఇటీవల రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించింది. అందులోభాగంగా పర్యాటకశాఖపై సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. జిల్లాలవారీగా పర్యాటకరంగ ప్రోత్సాహానికి ఏం చేయాలనేదానిపై సమాలోచనలు జరిపారు. ఈక్రమంలో కాకినాడ హోప్ ఐలాండ్‌కు బోటు షికారును ప్రారంభించాలనేదానిపై చర్చ జరిగింది. మంత్రి కందుల దుర్గేష్ పర్యాటకశాఖ మంత్రిగా ఉండడం, ఆయన గోదావరి జిల్లా నేత కావడంతో హోప్‌ఐలాండ్ పర్యాటకాన్ని ప్రారంభించే విషయంలో పట్టుదలగా ఉన్నారు. సీఎం సమీక్షకు వారం ముందు తన క్యాంప్ కార్యాలయంలో పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. కాకినాడ హోప్‌ఐలాండ్ పర్యాటకాన్ని ప్రారంభించాలని, పర్యాటకులనుంచి ఒత్తిడి వస్తోందని కూడా వివరించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కాకినాడ జిల్లా మంత్రిగా ఉండడం, ఎన్నికల సమయంలో హోప్ ఐలాండ్ పర్యాటకంపై హామీ ఇచ్చిన నేపథ్యంలో వేగంగా దీన్ని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సముద్రంలో ప్రయాణించే బోటుకు పూర్తిస్థాయి సాంకేతికంగా ఉండాలని, బోటు కూడా పెద్దదిగా ఉండాలని చర్చించారు. దీంతో పర్యాటకశాఖ తరఫున బోటు కొనుగోలు చేయాలని ఎట్టకేలకు నిర్ణయించారు. సీఎం చంద్రబాబు వద్ద ఈ ప్రతిపాదన ఉంచి నిధులు వేగంగా విడుదల చేయించడానికి మంత్రి దుర్గేష్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పీపీపీ విధానంలోను కొత్త కాంట్రాక్టర్లను రంగంలోకి దించి వారి ద్వారా బోటు నడిపించాలని ఆలోచిస్తున్నారు. సాధ్యమైనంత వేగంగా హోప్ ఐలాండ్ పర్యాటకుల కల నెరవేర్చాలనే పట్టుదలతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

కొత్తగా.. క్రేజీగా..



- కాకినాడలో నయా ట్రెండ్
- విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ఆకట్టుకుంటున్న రెస్టారెంట్‌లు
- కొత్త పేర్లతో ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ)

ఖైదీలా జైలులో ఉండి చికెన్ తినొచ్చు.. ఆర్డర్ పెడితే ఓ రైలులో వచ్చే బిర్యానీ లాగించొచ్చు.. ఎక్వేరియమ్‌లో చేపలను చూస్తూ ఆహారం ఆరగించవచ్చు.. ఊయలలో ఊగుతూ కూడా జ్యూస్‌లు తాగొచ్చు.. ఇలా నేటితరం కొత్తదనం కోరుకుంటోంది. క్రేజీగా ఆలోచిస్తోంది. వారి అభిరుచులకు తగ్గట్టుగా పలు వ్యాపార సంస్థలు విభిన్నమైన ఆలోచనలతో ముందుకు వస్తున్నాయి. అలా ఏర్పాటవుతున్నవే ఈ రెస్టారెంట్‌లు.. కాకినాడ నగరంలో ఈ కల్చర్ ఇటీవల ప్రారంభమైంది. వాటిపైనే ఈ ప్రత్యేక కథనం..



ఖైదీ హోటల్‌లో ఫుడ్ తింటున్న కస్టమర్లు

ఖైదీ హోటల్ కాకినాడలో ఖైదీ బిర్యానీ పేరుతో ఏర్పాటు చేసిన హోటల్ జైలు వాతావరణంలో ఉంటుంది. ఇందులో ఖైదీ డ్రస్సులు వేసుకున్న వారు ఫుడ్ సర్వ్ చేస్తుంటారు. ఇందులో మొత్తం 16 క్యాబిన్లు ఉండగా ఇందులో వీఐపీ క్యాబిన్ కూడా ఏర్పాటు చేశారు. ఈ క్యాబిన్‌లో 20మంది కూర్చుని ఫుడ్ తీసుకోవచ్చు.



ట్రైన్ రెస్టారెంట్‌లో రైలుబండిలో వస్తున్న ఫుడ్

ట్రైన్ రెస్టారెంట్ మీరు జస్ట్ ఆర్డర్ చేస్తే చాలు. ఓ రైలుఫుడ్ తీసుకుని వస్తుంది. రైలు బండి ఫుడ్ తీసుకువచ్చి అదే సర్వ్ చేస్తుంది. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఈట్రైన్ రెస్టారెంట్‌లో రైలుబండే ప్రత్యేకత. ఎంట్రీ దగ్గర ఏర్పాటు చేసిన రైల్వేబోగీ భోజన ప్రియులకు స్వాగతం పలుకుతుంది.





ఎక్వేరియం రెస్టారెంట్లో కనువిందు చేస్తున్న రంగురంగుల ఫిష్‌లు

అక్వేరియం రెస్టారెంట్ కాకినాడ భానుగుడి సెంట్రల్‌లో ఈ మధ్యనే ఏర్పాటు చేసిన అక్వేరియం రెస్టారెంట్ పిల్లల్ని బాగా ఆకట్టుకుంటోంది. రెస్టారెంట్‌లోని అక్వేరియంల్లో రకరకాల రంగురంగుల చేపలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ఆర్డర్ ఆలస్యమైనా ఎక్వేరియంలోని చేపలు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.



బకాసుర, కంటైనర్ రెస్టారెంట్‌లు



- కాకినాడలోనే ఓ చోట రెండు కంటైనర్లను రెస్టారెంట్‌గా మార్చి కంటైనర్ రెస్టారెంట్ థీమ్‌తో నిర్వాహకులు ఆహారప్రియులను ఆకట్టుకుంటున్నారు.
- బామ్మగారు రుచులు పేరుతో ఏర్పాటు చేసిన హోటల్లో ఉయ్యాలలు ఏర్పాటు చేశారు.
- ఈ మధ్యకాలంలో మండి రెస్టారెంట్ కల్చర్ ఎక్కువగా ఉంది.ఫ్యామిలీ, ఫ్రెండ్స్, కొలిగ్స్ చుట్టూ కూర్చుని పెద్ద ప్లేట్లో కలిసి తినడమే దీనిస్టైల్.
- ఖైదీహోటల్, ట్రైన్ రెస్టారెంట్, కంటైనర్ హోటల్, అక్వేరియం రెస్టాంట్, అమ్మమ్మగారి వంటిళ్లు, తిన్నంత బిర్యానీ, బకాసుర, బకెట్‌బిర్యానీ, నాయుడు గారి కుండ బిర్యానీ, బుట్ట బిర్యానీ, బాంబో బిర్యానీ, పల్లెటూరు రుచులు, కోకనాడ బిర్యానీ, రొయ్యలనాయుడు రెస్టాంట్, హంగ్రీబర్డ్స్..ఇలా కొత్త కాన్సెప్ట్‌లతో హోటల్ నిర్వాహకులు ముందుకు వస్తున్నారు.



ఉయ్యాలలా ఊగుతూ జ్యూస్ తాగుతున్న కస్టమర్లు

ఉయ్యాల రెస్టారెంట్ నిజానికి ఈ హోటల్ పేరు అమ్మమ్మ గారి వంటిల్లు. ఈ రెస్టారెంట్‌లో కూర్చున్న టేబుల్ మొత్తం ఉయ్యాలా ఊగుతూ ఉంటుంది. ఊగుతూ తింటూ బాగా ఎంజాయ్ చేయవచ్చు. కొత్త కాన్సెప్ట్ కావడంతో పిల్లలతోపాటు యువత కూడా ఈ రెస్టారెంట్‌పట్ల మక్కువ చూపుతున్నారు.

కదం తొక్కిన వైద్యులు

- కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ వైద్యుల విధులు బహిష్కరణ
- మూతపడిన ప్రైవేటు ఆస్పత్రులు



కాకినాడ జీజీహెచ్‌లో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు





ఆకాశంలో అపురూపాలు!

ఆకాశమంటేనే అద్భుతం. నింగి వైపు చూసిన ప్రతిసారీ సరికొత్తగా కనిపిస్తుంటుంది. ఒక్క హరివిల్లు కనిపించినప్పుడు అదిగో సప్త వర్ణ శోభితమని మురిసిపోతుంటాం కానీ, ఈ చిత్రాలు చూశాక ప్రతి రోజూ, ప్రతి రేయి అపురూపమే అనుకోకుండా ఉండలేం. మొదటి చిత్రం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మండపేట పట్టణంలో నీలాకాశంలో తెలుపు నలుపు సోయగాలు.. రెండోది.. అదే పట్టణంలో రాత్రి విద్యుత్ వెలుగుల మధ్య నుంచి అచ్చమైన నీలాకాశం.. మూడోది.. ఆకాశంలో మేఘాలు రెండు నీటి గుర్రాల ఆకృతిలో కనువిందు చేసిన దృశ్యం. ఒక నిమిషంపాటు ఉన్న ఈ దృశ్యం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలోనిది. - మండపేట/పెరవలి

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 17: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,65,620, అన్నదాన విరాళాలు రూ.64,874 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.9,560, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా 18,510, కానుకల ద్వారా రూ.9 వేలు, వెరసి రూ.2,68,114 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నాలుగేళ్లలో..ఆ రెండు చిత్రాలే..


డైరెక్టర్ సందీప్ వంగా

తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలోని సుకృత ఆడిటోరియంలో జీఎస్ఎల్ విద్యా సంస్థల మాతృ సంస్థ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

ప్రశ్న : మీరు చేసిన సినిమాల్లో వైద్య రంగానికి సంబంధించి ఉన్నాయి, దీనికి ప్రత్యేక కారణాలు?
సందీప్‌రెడ్డి : స్వతహాగా ఫిజియోథెరపిస్టుని కావడం వల్ల వైద్యంపై ఉన్న పరిజ్ఞానం సినిమాల్లో ప్రతిబింబింపజేసింది తప్ప ప్రత్యేకత ఏమీలేదు.
ప్రశ్న: ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్ చేస్తున్న మీరు సినిమాల వైపు ఎందుకెళ్లారు ?
సందీప్‌రెడ్డి: విద్యార్థి దశ నుంచి సినిమాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్‌లో ఉన్నప్పటికీ సినిమా రంగం వైపు మక్కువతో వెళ్లడం జరిగింది.
ప్రశ్న : మీరు చేసే తదుపరి సినిమాలేంటి?
సందీప్‌రెడ్డి : త్వరలో ప్రభాస్ హీరోగా స్పిరిట్ ప్రారంభమవుతుంది.
ప్రశ్న : మహేష్ బాబుతో ఒక సినిమా తీస్తానన్నారు, అదెప్పుడు?
సందీప్‌రెడ్డి : మహేష్‌బాబుతో ఒక సినిమా చేయాలనుకున్న మాట వాస్తవమే, కానీ ప్రస్తుతం స్పిరిట్ ప్రారంభించాలి. ఆ తర్వాత యానిమల్ పార్ట్-2 తీయాలి, ఈ రెండు ప్రాజెక్టు పూర్తయ్యేసరికి 3 నుంచి 4 సంవత్సరాలు సమయం పడుతుంది. ఆ తర్వాతనే ఏదైనా..
ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సందేశం?
సందీప్‌రెడ్డి : సినిమాల ద్వారానే నా సందేశం ఏమిటో చెబుతుంటాను, వాటిలో ఉన్న మంచిని స్వీకరించి, చెడును అక్కడనే వదిలేయాలి. - రాజానగరం

మనం చేసే పనిలో దృష్టి సారిస్తే విజయాలు సొంతం

» ప్రముఖ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా » ఘనంగా జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలు




వార్షికోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సందీప్‌రెడ్డి, పక్కన సందీప్‌రెడ్డికి సత్కారం

రాజానగరం, ఆగస్టు17: ఏ వృత్తిలో అయినా తాము చేసే పనిలో దృష్టిసారిస్తే విజయాలు సొంతమవుతాయని యానిమల్ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్‌రెడ్డి మాట్లాడుతూ చేసే పనిపై దృష్టి కేంద్రీకరిస్తే విజయం చేకూరుతుందన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన అధునాతన సౌకర్యాలను ఎక్కడా చూడలేదన్నారు. అక్కడికి వెళ్లి చదువుకోవాలనిపించే అతికొద్ది సంస్థల్లో జీఎస్ఎల్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన స్మార్ట్ ల్యాబ్‌తోపాటు లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించిన డైరెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. మరో ముఖ్య అతిథి రాజా నగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జీఎస్ఎల్ సంస్థల మూలంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, భవిష్యత్తులో జీఎస్ఎల్ సంస్థ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సినీ డైరెక్టర్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్ పాల్గొన్నారు.


అమ్మ ఇడ్లీ పథకాన్ని ప్రారంభిస్తున్న దర్శకుడు సందీప్‌రెడ్డి

స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే అమ్మ ఇడ్లీ

ప్రారంభించిన సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17: రాజమహేంద్రవరం జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే మూడు ఇడ్లీలు అందజేయడం పేషెంట్లకు, వారి సహాయకులకు ఎంతో ఉపకరమని సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేన్సర్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు పండ్లు పంచారు. కాగా కేవలం ఐదు రూపాయలకే మూడు ఇడ్లీలు, ఒక చట్నీ ఇస్తారని మేనేజర్ రామకృష్ణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన సోదరుడు, జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.




సర్జరీ అనంతరం చంటిబిడ్డ

రోజుల బిడ్డకు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

పుట్టుకతోనే ఉదర భాగంలో చర్మంలేని వైనం.. విజయవంతమైన ఇలియాస్టమీ సర్జరీ

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 17: నెలలు నిండకుండానే జన్మించిన రోజుల చంటిబిడ్డకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను అందించారు. ఆ బిడ్డను హెన్ (హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్) స్టేట్ ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎస్ మూర్తి శనివారం పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బోనంగి జానకి నెలలు నిండకుండానే స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 15న మగశిశువుకు జన్మనిచ్చింది. కాగా శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడకపోవడంతో పేగులు బయటకు వచ్చి శిశువు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లాడు. దీంతో అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. ఆ సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు రాగా పిడియాట్రిక్ సర్జరీ వైద్య బృందం శిశువుకు ఇలియాస్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జీజీహెచ్‌లోని గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న తల్లి జానకిని, డీఎస్ మూర్తి పరామర్శించి చంటిబిడ్డకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్చేందుకు ఆదేశాలు జారీచేశారు.

కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు నిదర్శనమిది

48 గంటల్లో ఇద్దరు బాలికల ఆచూకీ కనుగొన్నారు.. మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఆగస్టు 17: కిడ్నాప్‌కు గురైన ఇద్దరు బాలికల ఆచూకీ 48 గంటల్లో కనుగొనేలా తూర్పుగోదావరి జిల్లా పోలీసులు వ్యవహరించిన తీరు అభినందనీయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు ఇది నిదర్శనమని చెప్పారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మను తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన మహిళ సునీత కలుసుకుని, తన ఇద్దరు కుమార్తెల ఆచూకీ కనుగొనేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సునీత తన ఇద్దరు కుమార్తెలను మారోజు వెంకటేష్ అనే వ్యక్తిపై తనకు అనుమానాలు ఉన్నట్టు తెలియజేశారని చెప్పారు. దీంతో తాను మంత్రి లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతోపాటు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీతో మాట్లాడానని తెలిపారు. తాను ఎస్పీతో మాట్లాడిన 48 గంటల్లోనే ఇద్దరు బాలికలను తల్లి చెంతకు చేర్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. ఇందుకు కృషి చేసిన మంత్రి లోకేష్‌కు, తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, బస్సా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో అవకాశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ 2023, 2024లో పూర్తిచేసి 75% మార్కులు సాధించిన నాన్-మ్యాథ్స్ గ్రూపు విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం కల్పిస్తున్నారని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (జోన్ 1,2) ఐ.శారద తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆసక్తి కలిగిన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, వొకేషనల్ విద్యార్థులు ఈనెల 20న ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని ఆమె చెప్పారు. https://bit.ly/tecbeeGoAP లింక్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96429 73350 నెంబరు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని ఆర్ఐవో నరశింహం తెలిపారు. కాబట్టి అన్ని యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అర్హత కలిగిన వారందరూ పరీక్షకు హాజరయ్యేట్టు చూడాలని సూచించారు.



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 5.47 లక్షలతో నిర్మించిన సంపద తయారీ కేంద్రం (ఫైల్).. విచారణ చేపట్టాలని కార్యదర్శిని ఆదేశిస్తున్న నల్లమిల్లి

చెత్త నుంచి సంపద కేంద్రం మాయం చేశారు

» 32 కొబ్బరి చెట్లూ కొట్టేశారు » పోలీసులకు ఫిర్యాదు చేసిన మహేంద్రవాడ కార్యదర్శి » విచారణ చేపట్టాలన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 17: అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలోని తూర్పు పుంతరోడ్డులో చెట్టుపట్టా పథకం కింద కేటాయించిన భూమిలో కొబ్బరి చెట్లు నరికివేత వివాదాస్పదంగా మారింది. ఈ భూమిలో ఉన్న 32 కొబ్బరి చెట్లను నరికివేయడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి జి పద్మావతి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కార్యదర్శి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో తూర్పు పుంతరోడ్డులో ఎకరం భూమిని మేడపాటి పెదకాపు అనే కామిరెడ్డికి ప్రభుత్వం చెట్టూ పట్టా పథకం కింద 77 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. అయితే పట్టాదారుకు చెందిన కుటుంబీకులు గ్రామంలో ఎవరూ ఉండకపోవడంతో అప్పటి నుంచి చెట్లు నిరుపయోగంగా ఉండడంతో పంచాయతీ వాటిని సంరక్షిస్తూ వచ్చింది. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి ఈ భూమిని అధికారులు గుర్తించడంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5.47లక్షలతో నిర్మాణం చేపట్టారు. కొద్దికాలం దీన్ని వినియోగించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో సంపద కేంద్రాన్ని కూలగొట్టి కొందరు స్థలానికి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కేంద్రాన్ని మాత్రం పూర్తిగా తొలగించడంతో తిరిగి ఖాళీ స్థలంగా మారింది. గత రెండు రోజుల కిందట ఇదే స్థలంలో ఉన్న 32 కొబ్బరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి అదే స్థలంలో వదిలిపెట్టి పోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి వచ్చి విచారణ చేపట్టి చెట్లను కొప్పవరం గ్రామానికి చెందిన వ్యక్తులు నరికినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నరికిన చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. చెట్లు నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఆగస్టు 17: రైలు ఢీకొని మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని రైల్వే పెద్ద గేటు సమీపంలో విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు కిందపడి 19 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. రైల్వే ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు వి.భానుపద్మేశ్వరరావు (19)తుని మండలం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. మృతుడు చనిపోదామని ఉద్దేశంతోనే రైలు కింద తల పెట్టినట్టు తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి శవ పంచనామాలు అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

నందంపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

అంబాజీపేట, ఆగస్టు17: సహచర మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సస్పెండ్‌చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాంజీ అదే సచివాలయంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల ఈనెల ఒకటో తేదీన అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ యువతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో రాంజీని సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

చెక్‌పోస్టుల్లో 24 గంటలూ తనిఖీలు

కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం రవాణాపై ఉక్కుపాదం
జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 17: కాకినాడ పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్టుల్లో 24 గంటలూ తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టులో బొంబాయి కాటా వద్ద ఉన్న చెక్‌పోస్ట్, శక్తిగ్యాస్ సమీపంలో ఉన్న అవుట్‌గేట్ వద్ద చెక్‌పోస్టుల్లో 24 గంటలూ బియ్యం లారీల తనిఖీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ ఒక్కొక్క చెక్‌పోస్టు వద్ద ఒక డిప్యూటీ తహశీల్దార్‌తోపాటు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దర టెక్నికల్ అసిస్టెంట్లు, వీఆర్‌వో, పోలీసులు 24 గంటలూ మూడు షిఫ్టుల్లో పనిచేస్తారన్నారు. కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం ఎగుమతి కాకుండా ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ప్రతి లారీను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టులోకి అనుమతిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎగుమతిదారులు, హమాలీ అసోయేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు రోజూ వెయ్యి వాహనాలు వస్తున్నాయని, వాటిని సకాలంలో తనిఖీ చేయాలన్నారు. రోజుకు ఆరేడు ట్రిప్‌లు తిరిగే లారీలు చెక్‌పోస్ట్ వద్ద జాప్యం కారణంగా కేవలం మూడు ట్రిప్‌లు తిరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకుని వేగంగా తనిఖీలు చేయాలనే ఉద్దేశంతో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం బాల సరస్వతి, కాకినాడ ఆర్డీవో కిషోర్, ఎగుమతిదారులు, హమాలీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, ఆగస్టు 17: జేఎన్టీయూకేలో పరిపాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలువురు అధికారులను అంతర్గత బదిలీలుచేస్తూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబును జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులు లేని విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులను చూసేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన కల్చర్, ఆర్ఫన్ అవుట్‌రీచ్ డైరెక్టరేట్‌కు ఇన్‌ఛార్జి డైరెక్టరుగా బదిలీచేశారు. యూవీ రత్నకుమారిని ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ ఇన్‌ఛార్జి డైరెక్టరుగానూ, ప్రొఫెసర్ ఎం.నాగేశ్వరరావును వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(యూజీ) గానూ, ఎం.స్వరూపారాణిని అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ, ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ దీక్షితులను యూసీఈకే అకడమిక్స్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ నియమించారు. అదేవిధంగా కె.వెంకటరెడ్డిని ఈఈఈ విభాగాధిపతిగానూ, ఎన్.రామకృష్ణయ్యను సీఎస్ఈ విభాగాధిపతిగానూ, ఎం.శైలజను ఈసీఈ విభాగం ప్రొఫెసర్‌గానూ, ఎం.కుమారస్వామిని మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ, డాక్టర్ ఉషాదేవిని ఏసీఈగానూ బదిలీచేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన అధికారులను ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ అభినందించారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

కాకినాడ రూరల్, ఆగస్టు 17: కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఏపీఆర్ఈఐఎస్, ఏపీఎస్ఈఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీఎంఎస్ అన్ని ఇతర యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ కనీసం 15 ఏళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లా స్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. deoeg.org వెబ్‌సైట్‌లో ఉదహరించిన నియమ నిబంధనలననుసరించి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చెక్‌లిస్ట్‌ను పూరించి ఈనెల 28 లోపు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.


అప్పనపల్లిలో శనివారం బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు, ఆగస్టు 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం 3,671మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 2,948 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,17,707 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి పాశర్లపూడి బాడవకు చెందిన కాండ్రేగుల వెంకటేశ్వరరావు, సూర్యావతి దంపతులు రూ.11,111 విరాళం అందించారు.

నేడు పద్మశాలీ వధూవరుల వివాహ పరిచయ వేదిక

కాకినాడ సిటీ, ఆగస్టు 17: కాకినాడ వెంకట్‌నగర్ సాయిబాబాగుడి వాటర్ ట్యాంక్ పక్కన గల సంఘ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పద్మశాలీ వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పప్పు వీరకుమార్ తెలిపారు. వధూవరులు తమ ఫొటో, బయోడేటా తీసుకుని తల్లిదండ్రులతో ముందుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందన్నారు.

'విపత్తుల నివారణ పట్ల అప్రమత్తం'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 17: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విపత్తు నివారణ కేంద్ర సంస్థ (ఎన్‌డీఆర్‌ఎఫ్) మన్మోహన్ యాదవ్ కోరారు. శనివారం వాకలపూడిలో ఐఎంసీ సంస్థ టెర్మినల్‌ను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారు. మన్మోహన్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, నిరోధక యంత్రాలు, పరికరాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరిశ్రమల్లో ఆస్తి, ప్రాణ నష్టం నివారణ, ప్రమాదాలు, విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న సన్నద్ధతపై చేపడుతున్న చర్యలను ప్రదర్శించారు. అత్యవసర సమయంలో ఎస్‌సీబీఏ వినియోగం, సీపీఆర్ విధానం, క్షతగాత్రులకు అందించాల్సిన వైద్యచికిత్సలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంసీ లిమిటెడ్ సంస్థ మేనేజర్ ఏటీ శంకర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 17: దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆమె 9వ సర్కిల్‌లో పర్యటించారు. రెవెన్యూ కాలనీ, సంజయ్‌నగర్ వంటి ప్రాంతాల్లో డ్రైన్లు, నీరు నిలిచిన ఖాళీ స్థలాల్లో డ్రోన్స్ ద్వారా యాంటీ లార్వా యాక్టివిటీస్‌కు సంబంధించి స్ప్రేయింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. నగరంలో 150ఎకరాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ఈ యాక్టివిటీస్ చేపడతామని ఈ సందర్భంగా కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'బీజేపీ పథకాలపై ప్రచారం చేయాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 17: బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని జె.అన్నవరంలో మండల కమిటీ అధ్యక్షుడు కూరాకుల రాజా ఆధ్యక్షతన బందం అనిల్‌కుమార్ నివాసంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమ్మిడి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. మోదీ అమలు చేస్తున్న రేషన్, రైతు భరోసా తదితర పథకాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు. సింగిలి దేవి, ఏనుగు దర్మరాజు, పతివాడ వెంకటేశ్వరరావు, గండేపల్లి శ్రీను, తోట రామకృష్ణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్మికులను పర్మినెంట్ చేయాలి'

సామర్లకోట, ఆగస్టు 17: మున్సిపాల్టీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సర్వీసులను పర్మినెంట్ చేయాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మధు డిమాండ్ చేశారు. శనివారం సామర్లకోటలో మున్సిపల్ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్టు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అమలుచేయాలన్నారు. కార్మికుల సంఖ్య పెంచాలని, పనిచేసే పరికరాలను పెంచాలని ఆయన కోరారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు

'కల్యాణ మండపం పనులను ప్రారంభించాలి'

పిఠాపురం, ఆగస్టు 17: పట్టణంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మధ్యలో నిలిచిపోయిన కల్యాణ మండపం పనులు తక్షణం తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వేణుగోపాలస్వామి భక్త బృందం సభ్యులు ఆలయ అర్చకుడు విజయజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రూ.60లక్షలతో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారని, పనులు వేగంగా జరిగేలా చూడాలని వారు కోరారు.

'నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 17: గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ డీవీ సోమన్న డిమాండ్ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నీటిలో నుంచే విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని, అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం నీరు బయటకుపోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 17: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.చిరంజీవి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా చిరంజీవి మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండి విద్య ఉద్యోగాల దిశగా మక్కువ పెంచాలన్నారు. అధ్యాపకులు ప్రయాగమూర్తి, వెంకటేశ్వరరావు, సురేష్, వీరభద్రరావు, బంగార్రాజు, శివప్రసాద్, మేరీ, పుష్ప, సతీష్ పాల్గొన్నారు.

అపార్టుమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 17: కాకినాడ విద్యుత్తునగర్‌లో వీఎస్‌కే ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాసం అపార్టుమెంట్స్ బ్రోచర్స్‌ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు బొళ్ల కృష్ణమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, మాజీ కార్పొరేటర్లు పలివెల త్రిమూర్తులు, పి.ఉషారాణి, వీఎస్‌కే అపార్టుమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

కరప, ఆగస్టు 17: పెనుగుదురులో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు పసుపు, కుంకుమ, చీరలు, పండ్లు అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు గంటా నానిబాబు, గ్రామపెద్దలు రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచరరావు, టీడీపీ నాయకుడు పులపకూర మహేష్ పాల్గొన్నారు.

పాత ఇసుకపల్లిలో యానిమేటర్‌పై విచారణ

కొత్తపల్లి, ఆగస్టు 17: మహిళా సంఘాల సభ్యులకు చెందిన రుణాలు, స్త్రీ నిధి సొమ్ములను సంఘాలకు చెల్లించలేదనే ఫిర్యాదు మేరకు పాతఇసుకపల్లిలో శనివారం డీపీఎం పద్మావతి సంబంధిత యానిమేటర్‌పై బహిరంగ విచారణ నిర్వహించారు. సంఘ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. బ్యాంకు నుంచి మంజూరైన సుమారు రూ.15లక్షలను సంఘసభ్యులకు నయాపైసా చెల్లించలేదని పలువురు మహిళలు డీపీఎంకు వివరించారు. తదుపరి విచారణ సోమవారం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. విచారణలో బీజేపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, గ్రామ నాయకులు నడింపల్లి వెంకటేశ్వరరాజు, సత్యనారాయణరాజు, చంటిరాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ఏలేశ్వరం, ఆగస్టు 17: మండలంలోని మర్రివీడు గ్రామ శివారు కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం శనివారం లభ్యమైంది. ఏలేరు ప్రాజెక్టులోకి ప్రవహించే ప్రధాన కాలువలో అటుగా వెళ్తున్న మృత్స్యకారులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తుంచి పంచాయతీ అధికారులకు చెప్పగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మహిళ వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని... తల, కాళ్లు, చేతులు నరికేయడంతో మృతదేహంపై మొండెం, పసుపు రంగు లంగా మాత్రమే ఉందని.. దుండగులు హత్య చేసి వై.రామవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తాగుబోతు వీరంగం

పెద్దాపురం, ఆగస్టు 17: స్థానిక దర్గాసెంటర్ వద్ద శనివారం ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. సెంటర్‌లో బస్సు, ఆటోల కోసం వేచిఉన్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఇద్దరు మహిళలపై దాడి చేశాడు. వారికి చేతిపై స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు తాగుబోతుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సదరు తాగుబోతు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిగా గుర్తించారు. అతడు ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్నట్టు చెబుతున్నారు. మతిస్థిమితం లేక ఇలా ప్రవర్తించి ఉండి ఉంటాడని పలువురు పేర్కొన్నారు.

కదం తొక్కిన వైద్యులు

కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ
విధులు బహిష్కరణ
పలుచోట్ల ర్యాలీలు, ఆందోళనలు





పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులు, జగ్గంపేటలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం, కరపలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 17: కోల్‌కత్తాలో పీజీ వైద్యురాలిపై అత్యాచారంతో పాటు హత్య ఘటనను నిరసిస్తూ శనివారం వైద్యులు, వైద్యవిద్యార్థులు కదం తొక్కారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులను ఆయా యాజమాన్యాలు మూసివేయగా ప్రభుత్వ వైద్యులు, వైద్యవిద్యార్థులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో ఆందోళన చేపట్టిన జూనియర్ డాక్టర్లు ర్యాలీగా బయలుదేరి బాలాజీచెరువు మీదుగా జడ్పీ కూడలికి చేరుకుని అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్‌వో తిప్పే నాయక్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు మద్దతు పలికారు. కార్యక్రమంలో డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అమీరున్, డాక్టర్ అచ్యుత్, డాక్టర్ ధర్మాకర్‌పూజారీ, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ మనోహర్‌బాబు, డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ప్రియ, డాక్టర్ దేవీక పాల్గొన్నారు.

పిఠాపురం: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సంఘటనను నిరసిస్తూ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద వైద్యులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఓపీ సేవలు నిలిపివేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లకు చెందిన వైద్యులు, సిబ్బంది ప్రభుత్వాసుపత్రి ఓపీ విభాగం, ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. అత్యవసర కేసులను మాత్రమే వైద్యులు చూశారు. వైద్యురాలి అమానుష మృతికి కారకులు అందరిని అరెస్టు చేసి శిక్షించే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. ఆందోళనలో వైద్యులు డాక్టర్ సుజాత, డాక్టర్ రవికుమార్, డాక్టర్ చందన, డాక్టర్ కీర్తిప్రియ, డాక్టర్ సారా విక్టోరియా, డాక్టర్ అశ్విని, డాక్టర్ షబానా, డాక్టర్ మాధురి, డాక్టర్ రోజాప్రియ, డాక్టర్ జయరామ్, డాక్టర్ వినయ్ పాల్గొన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాత్యాలకు నిరసనగా పట్టణంలో శనివారం రాత్రి పెనుయేలు ప్రార్థన సహవాసం ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో ప్రదర్శన అనంతరం కోట గుమ్మం సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రేమ్‌సాగర్, ప్రైస్ వర్షిప్ బ్యాండ్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

జగ్గంపేట: కోలకత్తాలో వైద్యురాలిని హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి ఉరి తీయాలని జగ్గంపేట ప్రధాన కూడలిలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పీడీఎస్‌యూ(వీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి పులి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. జగ్గంపేట కమ్యూనిటీహెల్త్ సెంటర్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డాక్టర్లు వర్మ, సుగంధి, మాధురి ఉన్నారు.

గొల్లప్రోలు: కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం సంఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వైద్యురాలికి నివాళులర్పించారు. కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, నాయకులు డి.నారాయణమూర్తి, కేశవరపు వీరబాబు, గుడాల చార్లెస్, గొర్ల శివ, నాగేశ్వరరావు, ఏసు పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది ఆర్డీవో, తహశీల్దార్, ఎంపీడీవో, డీఎస్పీ కార్యాలయాల ఎదుట నిరసన తెలియచేశారు. స్థానిక ఆసుపత్రి నుంచి ర్యాలీ చేపట్టారు. తక్షణం నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్దాపురం, కాండ్రకోట, పులిమేరు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద పలు ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఏలేశ్వరం: మండల వైద్యాధికారిణి శైలజ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వాసుపత్రి నుంచి బాలాజీ చౌక్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. వైద్యులు రమేష్, హారిక, షైమున, సౌమ్యఇతిహాస్ ఉన్నారు.

కరప: కరపలో ప్రభుత్వ వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది నిరసన చేపట్టారు. కరప, వేళంగి పీహెచ్‌సీల సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని పీహెచ్‌సీ నుంచి ప్రధానరహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య వైద్యులు ఏంజిలిన్, సింధూర, సూపర్‌వైజర్లున్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్ నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. మండల పీహెచ్‌సీల వైద్యఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు సామాజిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సంతపేట సెంటరు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల సర్వేయర్‌కు వినతిపత్రం అందించారు.

తొండంగి: బిహెచ్ఎంఏ గ్రామీణ వైద్యులు శృంగవృక్షం గ్రామంలో నిరసన ప్రదర్శన చేశారు. మండల కన్వీనర్ సురేష్, రాష్ట్ర నాయకులు వెంకట్రావు, ఎంఎస్ఎన్.మూర్తి రాజు, వాసు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల పరిధిలో గల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు కిర్లంపూడి ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలని మానవహారంగా ఏర్పడ్డారు.

గండేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెవి నరేష్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బి.సురేంద్ర ఉన్నారు.

తుని రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తుని బ్రాంచ్ సభ్యులు వైద్య సేవలు నిలిపివేసి నినాదాలు చేశారు. తుని బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.రఘునాధరావు, సెక్రటరీ డాక్టర్ ఎ.రామకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ సీహెచ్ శ్రీమన్నారాయణ ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు ఎంపిక

ఆస్ట్రేలియా వెళ్లేందుకు రూ. 2.06లక్షలు వ్యయం

స్థోమత లేక దాతల కోసం ఎదురుచూపులు



ఏసుకుమార్

పిఠాపురం, ఆగస్టు 17: పట్టణానికి చెందిన బధిర క్రీడాకారుడు ఉమ్మిడి ఏసుకుమార్ పలు జాతీయ, రాష్ట్రస్థాయి బధిర బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో డఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సెప్టెంబరు 12 నుంచి 29వ తేదీ వరకూ నిర్వహించే ఆసియా, పసిఫిక్ బధిర బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారతదేశం జట్టుకు ఎంపికయ్యాడు. దేశంలో 12మంది క్రీడాకారులను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి సాయికుమార్ ఒక్కడే ఎంపికయ్యారు. అయితే ఇందులో పాల్గొనే క్రీడాకారులు ఎవరి ఖర్చులు వారే భరించాలని ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ డఫ్ షరతు విధించింది. ఇందుకు గానూ ఏసుకుమార్‌కు రూ.2.06లక్షలు ఖర్చు అవుతుందని కౌన్సిల్ ప్రతినిధులు తెలియజేశారు. అంత స్థోమత ఏసుకుమార్‌కు లేదు. తండ్రి సుబ్బారావు మరణం తర్వాత తల్లి వెంకటలక్ష్మిని, కుటుంబాన్ని అతడే వెల్డింగ్‌షాప్‌లో పనిచేస్తూ పోషిస్తున్నాడు. దాతలు ముందుకు వస్తే మెల్‌బోర్న్ వెళ్లి తన ప్రతిభ చూపాలని ఏసుకుమార్ భావిస్తున్నాడని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఇతర వివరాలు కోసం 9291291999 సంప్రదించాలని సూచించారు. విరాళాలు ఇచ్చే దాతలు ఏసుకుమార్ తల్లి ఉమ్మిడి వెంకటలక్ష్మి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పిఠాపురం బ్రాంచి అకౌంట్ నెంబరు 043210100139503, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 804321కు పంపాలని ఆయన కోరారు.

దుకాణాలపైకి దూసుకెళ్లిన వ్యాన్

కరప, ఆగస్టు 17: కరపలో శుక్రవారం అర్ధరాత్రి టమాటా లోడుతో వెళ్తున్న ఒక వ్యాన్ అకస్మాత్తుగా దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఘోరప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు... అనంతపురం నుంచి కాకినాడకు టమాటా లోడుతో ఒక ఐషర్ వ్యాన్ బయలుదేరింది. కరప బజారుసెంటర్‌కు వచ్చేసరికి ఒక్కసారిగా ఎడమవైపు నుంచి కుడివైపుకు స్పీడుగా వచ్చేసి దుకాణాలను గుద్దుకుంటూ విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. వ్యాన్ ముందుభాగం నుజ్జునుజ్జయిపోయి డ్రైవింగ్ సీట్‌లో ఉన్న శ్రీను క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కరెంట్ సరఫరాను నిలిపివేయించారు. 2గంటల పాటు శ్రమించి శ్రీనును బయటకు తీయగలిగారు. మరో డ్రైవర్ కూడా స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుల్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యాన్ బీభత్సంతో గుత్తుల కృష్ణ అనే వ్యక్తికి చెందిన కిళ్ళీకొట్టు, కాకర్ల శ్రీనివాస్‌కు చెందిన టిఫిన్ బండి పూర్తిగా ధ్వంసమయ్యాయి. భేరి చంద్రశేఖర్‌కు చెందిన మిఠాయి కొట్టు గోడ, చిక్కాల వీరబాబుకు చెందిన పూల దుకాణం స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

గండేపల్లి, ఆగస్టు 17: మండలంలో సూరంపాలెంలో రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈనేపథ్యంలో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 17: క్షేత్రస్థాయిలో ఉన్న రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కారం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో అర్జీల పరిష్కారం, భూసమస్యలు, డంపింగ్ యార్డులకు అవసరమైన స్థలాల గుర్తింపు, భూసేకరణ వంటి అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల విధుల తర్వాత తహశీల్దార్లు అందరూ తిరిగి జిల్లాలో బాధ్యతలు స్వీకరించారన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్‌వో తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో కిషోర్, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, కాకినాడ ఆర్డీవో కార్యాలయం ఏవో త్రినాథరావు పాల్గొన్నారు.

గృహనిర్మాణాల వేగవంతం

గృహనిర్మాణాలను వేగవంతం చేసి ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేకంగా కృషిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గృహనిర్మాణ పనుల పురోగతి, ఉపాధి హామీ పనిదినాల పెంపు, అర్జీల పరిష్కారం, ఎస్డబ్ల్యూపీసీ షెడ్స్ నిర్మాణం, హౌస్ హోల్డ్ పల్స్ సర్వే వంటి అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు సంబంధించి 2 నెలల లక్ష్యం నిర్దేశించుకుని అక్టోబర్ 2 నాటికి అన్ని ప్రాంతాల్లో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, హౌసింగ్ పీడీ సత్య నారాయణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ, సీపీవో త్రినాథ్, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ భారతి ఉన్నారు.

'దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కరప, ఆగస్టు 17: గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ సూచించారు. మండల గ్రామాల్లో శనివారం ఆయన సిబ్బందితో కలిసి ప్రజలకు పలు సూచనలు జారీచేశారు. బయట ఊర్లకు వెళ్లేవారు ముందుగా స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, వారి ఇళ్లల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ బిగించి దొంగతనాలు నిరోధించడానికి సహకరిస్తామన్నారు. ఇళ్లల్లో విలువైన వస్తువులను లాకర్లలో దాచుకోవాలని, సూచించారు. ఏఎస్ఐ ప్రసన్నకుమార్ ఉన్నారు.

సర్పవరం జంక్షన్: ఇంటి భద్రత కోసం తీసుకొచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని చోరీల నివారణలో భాగస్వామ్యం కావాలని తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కోరారు. తిమ్మాపురం పరిసర ప్రాంతాల్లో చోరీల నివారణ, అపరిచిత వ్యక్తుల కదలికలపై ముందస్తు చర్యలపై అవగాహన నిర్వహించారు.

కాకినాడ రూరల్: గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే 112కి కాల్ చేసి సమాచారమివ్వాలని ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. చీడిగలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామస్థులకు జాగ్రత్తలపై ఎస్ఐ అవగాహన కల్పించారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

సామర్లకోట, ఆగస్టు 17: సామర్లకోట ఏడీబీ రోడ్డు రాక్ సిరామిక్ నుంచి ఉండూరు జంక్షన్ వరకూ నిర్మాణంలో ఉన్న సుమారు 7 కిలోమీటర్ల ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణపనులను రైల్ వికాస్ నిగాం లిమిటెడ్ సీఎండీ ప్రదీప్ గౌర్ శనివారం సామర్లకోట చేరుకుని వివిధ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ వద్ద నిర్మిస్తున్న వంతెన పిల్లర్ల నుంచి ఉండూరు ఏడీబీ రోడ్డు వరకూ గల నిర్మాణపు పనులను పరిశీలించారు. జేపీ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి చక్కని ప్రభాకరరావు పాల్గొన్నారు.



సామర్లకోటలో పనులను పరిశీలిస్తున్న రైల్ వికాస్ సీఎండీ ప్రదీప్ గౌర్

ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

కొత్తపల్లి, ఆగస్టు 17: కొండెవరం వీఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో వేమగిరి రాంబాబు ఒకరే చైర్మన్ పదవి కోసం దాఖలు చేశారు. రాంబాబును ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎంఈవో బివేణుగోపాల్ ప్రకటించారు. రాంబాబు చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల టీడీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు.

స్కూల్ కమిటీ ఎన్నిక

తాళ్లరేవు, ఆగస్టు 17: గాడిమొగ పంచాయతీ పరిధి పెదవలసల యూపీస్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరవితేజ ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్‌గా లంకే కస్తూరికృష్ణ, వైస్ చైర్మన్‌గా బి.మానస ఎంపికయ్యారని ఎంఈవో ఎ.మంగాయమ్మ తెలిపారు.

గ్రావెల్ లారీల అడ్డగింత

పిఠాపురం రూరల్, ఆగస్టు 17: ఏ అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీలను జనసేన నాయకులు అడ్డుకున్నారు. కిర్లంపూడి మండలం వేలంక నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారని పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం సెంటర్‌లో గ్రావెల్ లారీలను మాజీ ఎంపీపీ, జనసేన నాయకుడు కురుమళ్ల రాంబాబు ఆధ్వర్యంలో నిలిపివేశారు. పిఠాపురం రూరల్ పోలీసులు లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



ప్రాకారసేవ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు సేవయిన ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుండి తోడ్కొనివచ్చి తిరుచ్చిపై ఆశీనులు గావించారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణలు, నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో రమేష్‌బాబు,పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దివ్య పూజలు

సత్యదేవుడి సన్నిధిలో తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రమేష్‌బాబు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా రమేష్‌బాబు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి, గంటా విష్ణు తదితరులు ఉన్నారు.

సరస్వతీగా వనదుర్గ

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారి శ్రావణ మాసోత్సవాలలో భాగంగా శనివారం సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బాలుడిని అభినందించిన డీఎస్పీ



జీవన్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

పెద్దాపురం/సామర్లకోట,ఆగస్టు 17: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సామర్లకోట మండలం గొంచాల ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదుతున్న కొల్లా జీవన్‌కుమార్ ఆంగ్లంలో మాట్లాడి అబ్బురపరిచిన విషయం తెలిసిందే. అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారీ బాలుడితో పాటు తల్లిదండ్రులను డీఎస్పీ కార్యాలయానికి పిలిచి అభినందించి బాలుడికి పుస్తకాలు, పెన్నులు బహుమతిగా అందజేశారు. ఉపాధ్యాయుడు బీఎస్ఎన్.మూర్తిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

కరప, ఆగస్టు 17: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులు బి.చరిష్మా సాయి మహలక్ష్మి, ఎంఎస్‌డీ చంద్రలేఖ, ఎస్.ప్రభంజనశ్రీ, సీహెచ్.శివసత్యనారాయణ, బి.అయ్యప్పస్వామి, పి.సంతోషిలను టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సత్కరించి మెమెంటోలను అందజేశారు. హెచ్ఎం మార్ని శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, యాళ్ల వీరవెంకటసత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ కూనపురెడ్డి వీర్రాజు, ఎం.రమేష్ తదితరులున్నారు.

ఆంజనేయరెడ్డికి మంత్రి అభినందన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 17: రమణయ్యపేట అనపాల ఆంజనేయరెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు గ్రహీత ఆంజనేయరెడ్డిని మంత్రి దుర్గేష్ అభినందించారు. గత రెండున్నర దశాబ్దాలుగా ప్రయాణికుల దాహార్తిని తీరుస్తూ చలివేంద్రం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సాధారణవిషయం కాదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రౌతులపూడి, ఆగస్టు 17: పి.చామవరంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యానశాఖాధికారి పి.అరుణ్‌కుమార్ ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వందశాతం రాయితీపై హెక్టార్‌కు రూ.27వేలు విలువైన 143 మొక్కలను అందిస్తున్నామన్నారు.బి.వెంకటేశ్వర్లు, ఎమ్.చక్రధర్, పడాల చిట్టిబాబు ఉన్నారు.

చిట్టిబాబుకు నివాళి

రౌతులపూడి, ఆగస్టు 17: టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా దివంగత నేత పర్వత చిట్టిబాబు చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూరభాస్కరరావు అన్నారు. ఆయన నివాసంలో యువనేత ఇటంశెట్టి అశోక్‌తో కలిసి చిట్టిబాబు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి ఎస్ఐగా వెంకటేష్

కొత్తపల్లి, ఆగస్టు 17: కొత్తపల్లి ఎస్ఐగా వెంకటేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో అదనపు ఎస్ఐగా పని చేసి కొత్తపల్లికి బదిలీపై వచ్చారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తానని వెంకటేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట రూరల్, ఆగస్టు 17: జె.కొత్తూరు శివారున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. అతడి నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

E.P. No.131/2022 in O.S.No.11/2022

Between:
మాసిన వెంకట రామకృష్ణ ...DHr
మరియు
యర్రమిల్లి మంగామణి ...JDr

పై నెంబరు అమలు గ్రంధములో JDr వద్ద నుండి DHrకు రావలసిన డిక్రీ బాకీకి గాను JDr తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలవు ఋస్మేహార్ను షరతులకు మరియు షెడ్యూలు ఆస్తిపై ది.31-05-2016వ తేదీ గల పి.మంగతాయారు గారి తనఖా బాకీకి లోబడి ది.**25-09-2024** తేదీన ఉదయం గం|| **10.30** ని||ల లగాయతు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. వేలంపాట పాడదలచినవారు వచ్చి సదరు వేలంపాట నందు పాల్గొని పాడుకోవలెను. వివరముల కొరకు పై కోర్టు నందు గాని, నజారత్ ఆఫీసు నందు గాని, DHr అడ్వకేటు గారి ఆఫీసు నందు గాని తెలుపవలెను.

SCHEDULE: East Godavari District, Kakinada Sub-Registrar, Kakinada Municipal Corporation, Kakinada, Vallabhai Street, Cinema Street, Northern side, Jonnada Street, Ward No.18, Block No.32, Municipal Ward No.4, Assessment No.87821, Tiled house bearing No.32-2-11, Adjacent to D.No.32-1-13, situated at 146.87 sq.yds. or 122. 86 sq.mtrs. beign bounded by:

East: 38'.0" - Joint Galli passing, South: 34'.9" - Raja Margam, West: 37'.0" - House wall of Chandrapu Jiyya Rao, North: 35'.0" - House belongs to Yerramilli Bhaskara Naga Venkata Ashik Guptha.

Within the above boundaries and measurement of schedule extent of 146.87 sq.yds. or 122. 86 sq.mtrs. of house with all common rights, water rights, path ways, bore well, box electrical meter, electrical connection and all easementary rights.

Amina Value Rs.42,50,000/-
DHr value Rs.6,00,000/-, JDr value: Not known
On behalf of Decreeholder
R.T. CHOWDARY, Advocate, D.No.28-3-26
Pidiproluvari Street, Kakinada, Cell: 944070810